క్లుప్తంగా

శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ బదిలీ


హబీబుల్లాఖాన్

శంకర్‌పల్లి: పట్టణ ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్‌ని శంకర్‌పల్లి పీఎస్ నుంచి గచ్చిబౌలి పీఎస్‌కి బదిలీ చేస్తున్నట్లు శుక్రవారం సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో డీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ గౌడ్‌ని శంకర్‌పల్లి సీఐగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శంకర్‌పల్లి ప్రజలతో అనుబంధం బాగుందని, శాంతి భద్రతల విషయంలో సహకరించారని తెలిపారు.

మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతల స్వీకరణ


మండల ప్రత్యేకాధికారి సురేష్ బాబును సన్మానిస్తున్న ఎంపీడీవో వెంకయ్య

శంకర్‌పల్లి: మండల ప్రత్యేకాధికారిగా చేవెళ్ల ఏ డీఏ సురేష్ బాబు శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య ఆయనను శాలువా కప్పి సన్మానించారు. గతంలో ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించిన రమాదేవి బదిలీపై వెళ్లారు.

రెడ్డి ప్రజా ప్రతినిధులకు సన్మానం

కొందుర్గు: హైదరాబాద్ శిల్పకళారామంలో ఈ నెల 6న రెడ్డి ప్రజా ప్రతినిధులకు సన్మానం ఉంటుందని రెడ్డి సేవా సమితి మండల కమిటీ అధ్యక్షుడు లంకాల రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రెడ్డి సేవా సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్వంతు రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజా రామేశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లా నీరు అందేలా చర్యలు

కొందుర్గు: ప్రతీ ఇంటికి నల్లా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్‌ఏఈ జయశ్రీ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం వివిధ గ్రామాల తాగునీటి సహాయకులకు శిక్షణా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో భగీరథ నీటిని ప్రతీఇంటికి చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎవరైనా నల్లాల వద్ద చర్రాలు తీస్తే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం

మొయినాబాద్ రూరల్: ఉన్నత విద్యలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలో హిమాయత్‌నగర్‌లోని చైతన్య యూనివర్సిటీ కళాశాలలో ఉన్నత విద్యలో ఫలితాలు సాధించిన విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాత్వికరెడ్డి మాట్లాడుతూ ఉన్నత ఆశయాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్, రాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారానికి ఆహ్వానం

ఆమనగల్లు: గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

నిర్మాణ రంగంలో వృత్తి నైపుణ్యం అవసరం

కడ్తాల్: భవన నిర్మాణ రంగంలో వృత్తి నైపుణ్యత అవసరమని కార్మిక నాయకులు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్), తెలంగాణ భవన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధి వంపుగూడలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేబర్ కార్డు ద్వారా అందే ప్రయోజనాలను వివరించారు.

ఒకే రాష్ట్రం.. ఒకే కార్డు

- సమగ్ర సర్వేతో పేదలకు లబ్ధి
- డిజిటల్ కార్డు కోసం ఇంటింటి సర్వే
- పైలెట్ ప్రాజెక్టు కింద కొత్తూరులోని నాల్గో వార్డు, ఫరూఖ్‌నగర్‌లోని కడియాలకుంట తండా ఎంపిక
- క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు


పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కడియాలకుంట తండా


తండాలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

షాద్‌నగర్: సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఫ్యామిలీ డిజిటల్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిజిటల్ కార్డులను ఇచ్చేందుకు గాను ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించనుంది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద షాద్‌నగర్ పరిధిలోని కొత్తూరు మండలంలో ఒక వార్డు, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాల కుంట తండాను ఎంపిక చేసింది.

పైలెట్ ప్రాజెక్టు కింద తండా..

ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డు ఇచ్చేందుకు గాను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద షాద్‌నగర్ పరిధిలో కొత్తూరు మున్సిపాలిటీలోని 4వ వార్డు, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండాను ఎంపిక చేసింది. కొత్తూరు మున్సిపాలిటీలోని నాల్గో వార్డులో మొత్తం 185 కుటుంబాలు ఉన్నాయి.మొత్తం జనాభా 1,042 ఉంటారు. అదే విధంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండా పరిధిలోకి రాయికల్ తండా, బూర్గుగడ్డ తండాలు వస్తాయి. కడియాలకుంట గ్రామ పంచాయితీ పరిధిలో మొత్తం 271 ఇళ్లు ఉన్నాయి. సుమారు 1006 మంది జనాభా నివసిస్తున్నారు. ఇందులో సుమారు 670 మంది ఓటర్లు ఉన్నారు. తండా పరిధిలో మొత్తం పది వార్డులు ఉన్నాయి.

ఇంటింటికి అధికారులు...

కుటుంబ డిజిటల్ కార్డుల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఒకే రాష్ట్రం, ఒకే కార్డు విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్, ఆరోగ్య సేవలతో పాటు, సంక్షేమ పథకాలన్నీ కుటుంబ డిజిటల్ కార్డు ద్వారా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి కుటుంబానికి ఒక ప్రత్యేక నంబర్‌తో కార్డు ఇవ్వనున్నారు. రేషన్ కార్డు, రైతు బంధు, పెన్షన్ తదితర సంక్షేమ పథకాల్లో డేటా ఆధారంగా ఇప్పటికే కుటుంబ సభ్యుల వివరాలను అధికారులు గుర్తించారు. ఇవి సరిగ్గా ఉన్నాయా ? లేవా? అన్న విషయాలను అధికారులు నిర్ధారించుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారుల బృందం పర్యటించి కొత్త సభ్యులను చేర్చడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, అదేవిధంగా కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్, కుటుంబ పెద్ద, యజమానికి మిగితా సభ్యుల మధ్య సంబంధాలు, కుటుంబ సభ్యుల ఫొటో వంటి వాటిని అధికారులు సేకరిస్తున్నారు. షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ల బృందం ఎంపికైన వార్డు, గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

ఐదు రోజుల పాటు క్షేత్ర స్థాయి పర్యటన...

పైలెట్ ప్రాజెక్టును నియోజకవర్గ స్థాయిలో ఆర్డీవో పర్యవేక్షిస్తారు. ఐదు రోజుల పాటు అధికారులు గ్రామాల్లో పర్యటించి పూర్తి స్థాయిలో సేకరించనున్నారు.పైలెట్ ప్రాజెక్టులో ఎదురయ్యే సానుకూలతలు, ఇబ్బందులను సమీక్షించుకొని మార్పులు, చేర్పులతో కుటుంబ కార్డులను ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుంది. గ్రామాల్లో అధికారులు ఈ నెల 7వ తేదీ వరకు పర్యటించి వివరాలు సేకరించనున్నారు.

> **కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నాం**
>
> 
>
> డిజిటల్ కార్డుల ప్రక్రియలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా కడియాలకుంట తండా ఎంపికై ంది. కొత్తూరులోని నాల్గో వార్డుతో పాటు, కడియాలకుంట తండాల్లో అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు పంపిస్తాం.
>
> – వెంకటమాధవరావు, ఆర్డీవో, షాద్‌నగర్

పేదల సంక్షేమమే లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


చెక్కులు పంపిణీ చేస్తున్న కాలె యాదయ్య

చేవెళ్ల: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ సంబంధించి 33 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వెంకట్‌రెడ్డి, ఎం.క్రిష్టారెడ్డి, సున్నపు వసంతం, ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్య, శంకర్, రాములు, పెంటయ్యగౌడ్, నరేందర్, పాండు, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌ముదిరాజ్, సురేందర్, చెన్నయ్య, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయ ఆత్మీయ సన్మానం..

మల్కాపూర్ సమీపంలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని ఉపాధ్యాయుల ఆత్మీయ సన్మాన సదస్సు నిర్వహించనున్నట్లు, ఈ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య సభా ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహా, శ్రీధర్‌బాబు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, అధికారులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు.

పగలే వెలుగులు!

- విద్యుత్ వృథా
- పట్టించుకోని అధికారులు


కాశింబౌలి వెళ్లే దారిలో వెలుగుతున్న వీధి లైట్

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని బాకారం గ్రామంలో రాత్రింబవళ్లు వీధి దీపాలు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బుధవారం బాకారం గ్రామంలో పగటి పూట వీధి దీపాలు వెలుగుతున్నాయని గ్రామస్తులు పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు వీధి దీపాలు వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతుందని చెబుతున్నారు. వీధిదీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఉన్నప్పటికీ, స్విచ్‌వేసి మరచిపోయి ఉంటారని వాపోయారు. ఇప్పటికైనా ఇలాంటి పొరపాట్లు జరగకుండా పైఅధికారులు స్పందించి పగటి పూట వెలిగే వీధిదీపాలను బంద్ చేయించాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మినీస్టేడియంలో బీఆర్ఎస్ నాయకుడు అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యాయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. క్రీడాకారులు లక్ష్య సాధనకోసం కృషి చేయాలన్నారు.కృషి, పట్టుదలతో నిరంతరం శ్రమిస్తే విజయ తీరాలకు చేరుకుంటారన్నారు. ఆటల్లో జయ, అపజయాలు సహజమని, గెలుపు ఓటములను సమానంగా స్వీక రించాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మ న్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఈటగణేష్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, బచ్చలి నర్సింలు, మహ్మద్‌ఎజాజ్, సుధీర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మొయినాబాద్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మెథడిస్ట్ జిల్లా యూత్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా పోటీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన పోటీలను ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా తమ ఖాళీ సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ప్రేమ్‌కుమార్, చిన్న, శ్రీధర్, భాస్కర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రులు


షాద్‌నగర్ రూరల్: కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలో భక్తులు


షాబాద్: మల్లారెడ్డిగూడ గ్రామంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల, షాద్‌నగర్ పరిధిలో ఏర్పాటు చేసుకున్న మండపాల్లో, ఆయా దేవాలయాల్లో, ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధర్యంలో శుక్రవారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


మొయినాబాద్ రూరల్:చైతన్య యూనివర్సిటీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

చేవెళ్ల, షాద్‌నగర్ పరిధిలో శుక్రవారం కూడా బతుకమ్మ వేడుకలు కొనసాగాయి. చిత్తూ చిత్తూల బొమ్మ...శివుని ముద్దుల గుమ్మ..బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ బావిలోన.... బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో...అంటూ మహిళలు ఆడిపాడి ఘనంగా నిర్వహించారు.


షాద్‌నగర్‌లో.. బతుకమ్మతో మహిళలు

అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- రహదారుల నిర్మాణానికి పెద్దపీట


షాద్‌నగర్: వెలిజర్లలో పనులు ప్రారంభిస్తున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామం నుంచి గొల్లకుంట తండా, జీడీగడ్డ తండాల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా సౌకర్యం సరిగా ఉంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదయ్య యాదవ్, బాల్‌రాజ్ గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాడ్యాల న ర్సింహ్మారెడ్డి, రాజు, జంగయ్య, తుప్పరి శేఖర్, గణే ష్, కృష్ణ, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని బల్లరాళ్ల తండా, తొమ్మిదిరేకుల గ్రామ శివారులోని బాలయ్య తండా బీటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో అండర్‌డ్రైనేజీ పనులు, జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేర్కొన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల అధ్యక్షుడు గూడ వీరేష్, యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, గిరియాదవ్, రూప్లానాయక్ పాల్గొన్నారు.



నేడు లయన్స్‌క్లబ్ రీజియన్ సమీక్ష

ఆమనగల్లు: కల్వకుర్తి పట్టణం లయన్స్ భవన్‌లో శనివారం లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషాలు ఒక ప్రకటనలో తెలిపారు. లయన్ రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించే సమీక్షలో రీజియన్ పరిధిలో చేపట్టే సేవా కార్యక్రమాల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టండి

ఆర్డీవో వెంకటమాధవరావు


కొత్తూరు: వివరాలు నమోదు చేస్తున్న ఆర్డీవో వెంకటమాధవరావు

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను సంబంధిత అధికారులు పకడ్బందీగా చేపట్టాలని షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఇతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాలుగో వార్డులో కుటుంబాల నుంచి సేకరించాల్సిన వివరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: ఫ్యామిలీ డిజిటల్ కార్డు రూపకల్పనలో భాగంగా పట్టణ, గ్రామాల్లో నివసిస్తున్న ప్రతీ ఒక్కరి సమాచారాన్ని సేకరిస్తామని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పైలెట్ ప్రాజెక్ట్‌కి శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని 14వ వార్డు ఎంపికైంది. మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి తిరిగి సమాచారం సేకరిస్తున్నారు. ఈ సర్వేలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి

శంకర్‌పల్లి: ఇటీవల బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల వేతనాల బిల్లులను చెల్లించాలని మండల టీయూటీఎఫ్ అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో చేసిన పనులకు బిల్లులు రాలేదని, ఈ విషయంలో ప్రభుత్వం సహకరించాలన్నారు.

ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితారెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల స్వగ్రామంలో శుక్రవారం ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద కుమారులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, జిల్లా నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరపురాని ప్రజానేత ఇంద్రారెడ్డి అని అన్నారు. చేవెళ్ల, ఖానాపూరం, చిట్టెంపల్లి గేట్‌ల వద్ద ఇంద్రారెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, డీసీఎంఎస్ చైర్మన్ పి. క్రిష్టారెడ్డి, వికారాబాద్ జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయకుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్‌పటేల్, హాఫీజ్, లక్ష్మణ్, చిలకమర్రి నర్సింహ, దేశమొళ్ల ఆంజనేయులు, వెంకటస్వామి, శశిధర్‌రెడ్డి, బాల్‌రాజ్, ప్రభాకర్, కర్నె శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నిర్మాణం ఆక్రమణ కాదు..

రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి చేసే ఆరోపణలు బాధ్యతాయుతంగా ఉండాలని ఏది పడితే అది మాట్లాడటం సరికాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. చేవెళ్లలో ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా కౌకుంట్ల గ్రామంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి నిర్మాణం ఆక్రమణ కాదని, పేదల నిర్మాణాలను కూల్చడం బాధాకరమన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తారణ జాప్యం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నారు. రెండేళ్లుగా టెండర్లు పూర్తి చేసుకున్న నిర్మాణ పనులు కొనసాగక పోవడం ఈ ప్రాంతా పాలకుల వైఫల్యమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు.

ఘన నివాళులు..

చేవెళ్ల మండలకేంద్రంలో ఇంద్రారెడ్డి విగ్రహానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేదని ఇంద్రారెడ్డి తన రాజకీయ గురువని అన్నారు. ఆయనను ఎప్పటికీ మరిచి పోలేమని తెలిపారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్ రూరల్: ఇంద్రారెడ్డి సేవలను ప్రజలు మరచిపోలేరని గౌడ సంఘం మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్ పేర్కొన్నారు. నక్కలపల్లి గ్రామంలో గ్రామస్తులు ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: ఇంద్రారెడ్డి కుటుంబం చేవెళ్ల గడ్డకు రుణపడి ఉంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు కొత్త నర్సింహ్మారెడ్డి, షేక్ మహబూబ్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవుఫ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


చేవెళ్ల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు